క్లుప్తంగా

చెత్త తొలగింపు



పరిసరాలు శుభ్రం చేస్తున్న సిబ్బంది

సాక్షి స్పందన

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో పారిశుధ్య అధ్వానంగా ఉండడం, కాలనీల్లో మురుగుకాల్వల్లో పూడిక, చెత్త నిండి దుర్వాసన వస్తోంది. దీంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై 'గిట్లుంటే రోగాలు రావా' శీర్షికన సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వెంటనే పారిశుధ్య పనులు చేపట్టి చెత్తను తొలగించారు. సమస్య వెలుగులోకి తెచ్చి పరిష్కారానికి కృషిచేసిన 'సాక్షి'కి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



రాజూర పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంకటరమేశ్

లోకేశ్వరం: విద్యార్థులకు కొత్త మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. మండలంలోని రాజూర, మన్మద్, భాగాపూర్ గ్రామాల్లోని సెగ్రిగేషన్ షెడ్, నర్సరీలు, పాఠశాలలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు కష్టపడి చదివి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. ఈవోపీఆర్డీ సోలమాన్‌రాజ్, ఏపీవో జగన్నాథ్, రాజూర పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వర్, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కోసం కృషిచేయాలి'

భైంసాటౌన్: ఢిల్లీలో బీజేపీ విజయోత్సాహంతో రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొమురయ్య గెలుపు కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. పట్టణంలోని ఎస్‌ఎస్ కాటన్‌లో నాయకులు, కార్యకర్తలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ముధోల్ నియోజకవర్గంలో 4,890 మంది పట్టభద్రుల ఓటర్లున్నారని, 25 మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జిగా నియమించామన్నారు. ప్రతి ఓటరు తమ ఓటును సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ముధోల్‌కు చెందిన సంతోష్ 285 మంది పట్టభద్రులకు ఓటుహక్కు కల్పించడంతో ఈ మేరకు ఆయన్ను అభినందించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన మండలాధ్యక్షులు దత్తాత్రి, పోతన్న, సుష్మరెడ్డి, లక్ష్మారెడ్డిలను సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి హరినాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

తిర్పెల్లికి బస్సు వచ్చిందోచ్

లక్ష్మణచాంద: మండలంలోని తిర్పెల్లికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావుకు ఇటీవల గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఆయన చొరవతో సోమవారం గ్రామానికి ఆర్టీసీ బస్సు వచ్చింది. ఇందుకు కృషిచేసిన శ్రీహరిరావుతోపాటు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేశ్వర్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

వసతి గృహానికి అనాథ పిల్లల తరలింపు

ముధోల్: మండలంలోని ఆష్టా గ్రామంలో అనాథలైన ఇద్దరిని సోమవారం వసతి గృహానికి తరలించారు. కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ ఆదేశాల మేరకు వీరిని భైంసా వివేకానంద ఆవాసంలో ఉన్న చిన్నారులను నిర్మల్‌లోని సదనం వసతి గృహానికి బాలల సంక్షేమ పరిరక్షణ అధికారి దేవి మురళీ, సభ్యురాలు సల్ల శ్రీలత తరలించారు. బాలల పరిరక్షణ సమితి సభ్యులు , మాజీ సర్పంచ్ అశోక్ ఉన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

నిర్మల్‌రూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్ అలీ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం బెల్ట్ ప్రమోషన్ టెస్ట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ వల్ల విద్యార్థులకు ఆరోగ్యంతోపాటు, పోరాట పటిమ సాధించవచ్చు అన్నారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పాల్గొన్నారు.

నాణ్యత నగుబాటు



తానూరు-జౌలా(బి) రహదారిపై ఏర్పడిన గుంతలు

- మట్టిదారులుగా తలపిస్తున్న సీసీ రోడ్లు
- బీటలు వారుతున్న తారు రోడ్లు
- చేతులు దులుపుకున్న కాంట్రాక్టర్లు
- పట్టించుకోని ఇంజినీరింగ్ అధికారులు



గుంతలమయంగా ఉమ్రి(కే), ఇలేగాం రహదారి

తానూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన రహదారుల నిర్మాణం నగుబాటుగా మారింది. ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన రోడ్లు మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. లక్షల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది. కాంట్రాక్టర్లు నాణ్యత పాటించకుండా వేసిన సీసీ రోడ్లు కంకర తేలి దర్శనమిస్తోంది. అవి మట్టి రోడ్లులా కనిపిస్తున్నాయి. తారు రోడ్లు వేసిన కొన్నాళ్లకే బీటలు వారుతున్నాయి. నాణ్యత పర్యవేక్షించాల్సిన ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. థర్డ్‌పార్టీ క్వాలిటీ కంట్రోల్ ఉన్నా అది తూతూమంత్రంగా తయారైందనడానికి గతంలో వేసిన సీసీ రోడ్లు, తారురోడ్లు చూస్తే అర్థమవుతోంది.

మట్టిరోడ్డులా సీసీ..గుంతలుగా బీటీ రోడ్లు

మండలంలోని ఉమ్రి(కే) జేఎస్ రోడ్డు నుంచి ఇలేగాం గ్రామం వరకు 8 కి.మీ తారురోడ్డు నిర్మాణానికి పీఆర్ నిధుల నుంచి రూ.7.10 కోట్లు మంజూరయ్యాయి. 2019 ఏప్రిల్, మే నెలలో పనులు చేపట్టి జూన్‌లో పూర్తయింది. ఉమ్రి(కే)లో 800 మీటర్ల వరకు రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. ఇసుక దొరకడం లేదని కాంట్రాక్టర్ క్రషర్‌లో లభించే డస్ట్‌తో చేపట్టిన సీసీ పనులు చేపట్టారు. ఏడాదిలో కంకరతేలి మట్టిరోడ్డును తలపిస్తోంది. కాంట్రాక్టర్ నాణ్యత పాటించకపోవడంతోనే రోడ్డు అధ్వానంగా మరి గుంతలు ఏర్పడ్డాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఉమ్రి(కే) శివారు ప్రాంతంలో తారు రోడ్డుకు గుంతలు పడడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రెండేళ్ల క్రితం తానూరు శివారు ప్రాంతం నుంచి జౌలా(బి) గ్రామం వరకు 3 కి.మీ మేర చేపట్టిన బీటీ రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. గత నాలుగేళ్ల క్రితం జౌలా(కే) జేఎస్ రోడ్డు నుంచి 2 కళ్యాణి గ్రామం వరకు తారు రోడ్డు నిర్మాణానికి రూ.23 లక్షలు మంజూరైంది. సంబంధిత కాంట్రాక్టర్ బీటీ రోడ్డు పనులు చేపట్టారు. కొన్నాళ్లకే బీటలు వారాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేక కాంట్రాక్టర్లు తూతూమంత్రంగా పనులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

రోడ్లు వేసిన కొన్నాళ్లకే..

గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. సంబంధిత కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. కొన్నాళ్ల క్రితం తానూరు శివారు ప్రాంతం నుంచి మహారాష్ట్ర సరిహద్దు జౌలా(బి) వరకు ఆర్ అండ్‌బీ నిధులు రూ.84 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ ఇరువైపులా మొరం వేయాల్సి ఉండగా తూతూమంత్రంగా పనులు చేపట్టి చేతులు దులుపుకున్నారు. గత నాలుగేళ్ల క్రితం హంగిర్గా నుంచి ముధోల్ వెళ్లేమార్గంలో దాగాం గ్రామంలో రూ.16 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు కొన్నాళ్లకే మట్టి రోడ్డులా తయారైంది.

మరమ్మతు చేపట్టాలి



ఉమ్రి(కే) గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్డు మట్టిరోడ్డులా తయారైంది. బీటీ రోడ్లపై గుంతలు వల్ల ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు రోడ్డుకు మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి. – లక్ష్మణ్, ఉమ్రి (కే)

బాలికల్లో నైపుణ్య అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

కుంటాల: బాలికల్లో నైపుణ్య అభివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. మండలంలోని కల్లూరు కేజీబీవీ పాఠశాలలో బేటీ బచావో బేటీ పడావో దశాబ్ది ఉత్సవాలు సోమవారం నిర్వహించారు. మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. విద్య, సామాజిక భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమాన్ని పకడ్బందీగా కొనసాగించాలని ఆదేశించారు. ఆడపిల్లలను పుట్టనిచ్చి, చదివించి ఎదిగేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో రహీంఖాన్, సీడీపీవో నాగలక్ష్మి, డీసీపీవో మురళి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సంధ్యారాణి, మహిళా సాధికారత కోఆర్డినేటర్స్ శైలజ, మౌనిక, సవిత, జ్యోతి, చైల్డ్‌లైన్ సిబ్బంది పద్మావతి, ఐసీపీఎస్ సిబ్బంది శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటిని తోడేస్తున్నారు

- భగీరథ పైప్‌లైన్ వాల్వ్ తొలగింపు
- రాత్రివేళ పంటలకు నీరు



భగీరథ పైప్‌వాల్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది

తానూరు: భైంసా నుంచి తానూరుకు సరఫరా చేసే మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్‌కు రాత్రివేళ వాల్వ్ ఆన్‌చేసి పలువురు గ్రామస్తులు నీటిని తోడేస్తున్నారు. ఆ నీటిని పంటలకు అందిస్తున్నారు. తానూరు మండలం హిప్నెల్లి, బోరిగాం గ్రామాలకు చెందిన కొందరు వ్యవసాయ పొలాలు సమీపంలో ఉన్న వారు రాత్రివేళలో వాల్వ్ తొలగించి పంటలకు నీటి తడిపెడుతున్నారు. బోరిగాం సమీపంలో ప్రధాన పైప్ వాల్వ్ తొలగించి వాగులో నీటిని వదలి విద్యుత్ మోటార్లతో తోడేస్తున్నారు. దీంతో ఖర్బాలా, దౌలతాబాద్, తొండాల, జౌలా(బి), ఎలవ్వత్, వాడోన, సింగన్‌గాం, నంద్‌గాం గ్రామాలకు మూడు రోజులుగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ప్రజలు తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న భగీరథ సిబ్బంది సోమవారం పైప్‌లైన్లు పరిశీలించారు. హిప్నెల్లి, బోరిగాం వద్ద వాల్వ్‌లు తొలగించి నీటిని తోడేస్తున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాలకు భగీరథ నీరు సరఫరా చేసేలా చూస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పృథ్వీ తెలిపారు.

రాష్ట్రకమిటీలో జిల్లావాసులు

ఖానాపూర్: మాస్టిన్ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీలో జిల్లా వాసులకు చోటు దక్కిందని సంఘం జిల్లా అధ్యక్షుడు దర్శనాల చిన్నఆశన్న తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కరీంనగర్‌లో రాష్ట్ర అధ్యక్షుడు నాగిల్లి నర్సయ్య ఆధ్వర్యంలో నాగిల్లా ఆశన్న, నాగిల్లా రాజేందర్, దర్శనాల అశోక్, నాగిల్లా నాగార్జున్, దర్శనం నర్సయ్య, ప్రశాంత్‌లను రాష్ట్ర కమిటీలో తీసుకున్నామని తెలిపారు.

'కాంటాక్టర్ నిర్లక్ష్యం సరికాదు'

ఖానాపూర్: ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ వేతనాల చెల్లింపులో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం సరికాదని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సభ్యులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్మికుల నాలుగు నెలల వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ఆర్ ఉపాలి, నాయకులు శ్రీనివాసచారి పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన



భైంసాటౌన్: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే



సారంగపూర్: ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పండితులు, ప్రజలు

భైంసాటౌన్: పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం గణపతి, దేవి శ్రీవల్లి దేవసేనసహిత సుబ్రహ్మణ్య, మహాలింగ, నంది, అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఎమ్మెల్యే రామారావు పటేల్ హాజరై పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల కోసం అన్నదానం ఏర్పాటు చేశారు. కాలనీపెద్దలు, బీజేపీ నేతలు ఉన్నారు.

మామడ: పొన్కల్‌లో నూతనంగా నిర్మించిన శివాలయంలో సోమవారం శివపార్వతులు, శివలింగం, వినాయకుని విగ్రహాలు, ఆలయం ఎదుట ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం శివపార్వతుల కల్యాణాన్ని కమనీయంగా జరిగింది. భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీంరెడ్డి శివాలయంలో పూజలు అనంతరం ఆయన్ను ఆలయకమిటీ సభ్యులు సన్మానించారు.

సారంగపూర్: తాంద్ర(జి) గ్రామంలోని హనుమాన్ ఆలయం ఎదుట ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వీడీసీ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

బాసర: టాక్లీ గ్రామంలో ఖండోబా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే రామారావు పటేల్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు.

లోకేశ్వరం: మండలంలోని పిప్రి శివాలయం తృతీయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే రామారావు పటేల్ పాల్గొని పూజలు చేశారు. ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. నాయకులు నారాయణరెడ్డి, రాజేశ్వర్, విలాస్ ఉన్నారు.

లక్ష్మణచాంద: బోరిగాం తండాలో ఆదివాసీలు జగదాంబ దేవి పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ జిల్లా ఎస్టీ సెల్ వైస్ చైర్మన్ ప్రేమ్‌దాస్, పూజారి రాథోడ్ పద్మ, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: రాచాపూర్, వడ్యాల్, తిర్పెల్లి గ్రామాల్లో భీమన్న జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో భీమన్న గదలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులు అగ్ని గుండం దాటారు.

మార్కులే కొలమానం కాదు

- త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న గవర్నర్, ఎమ్మెల్యేలు

నిర్మల్: విద్యార్థుల ప్రతిభకు మార్కులే కొలమానం కాదని, పరీక్షల పేరిట వారిపై ఒత్తిడిని పెంచొద్దని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. పిల్లలు తరగతిగదిలో ఉపాధ్యాయుడు చెప్పే పాఠాలను వినడంతోపాటు, అర్థం కానివి ఉంటే అడిగి తెలుసుకోవాలని హితబోధ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రైవేటు హైస్కూల్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించిన ఇగ్నైట్–2కే25 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బీజేఎల్పీనేత మహేశ్వర్ రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్, పాఠశాల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్ రెడ్డి, నాయకులు, నిర్వాహకులు అయ్యన్నగారి భూమయ్య, నాగభూషణం, సుధాకర్, కిషన్, అంబారాణి, ట్రస్మా బాధ్యులు వెంకటేశ్వరరావు, చంద్రప్రకాశ్‌గౌడ్, ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్/నిర్మల్‌రూరల్/లక్ష్మణచాంద: జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆర్‌సోమవారం స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం మహేశ్వర్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విందులో గవర్నర్ పాల్గొన్నారు. లక్ష్మణచాంద మండల నాయకుడు రమేశ్, నాయకులు ఉన్నారు.

హర్యానా గవర్నర్‌ను కలిసిన రాంనాథ్

నిర్మల్‌చైన్‌గేట్: హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయని చండీగఢ్‌లోని హర్యానా రాజ్‌భవన్‌లో బీజేపీ రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయనకు గవర్నర్ జ్ఞాపిక అందించారు.

పారిశుధ్య నిర్వహణను నిర్లక్ష్యం చేయొద్దు



పేండ్‌పెల్లిలో పర్యటిస్తున్న అదనపు కలెక్టర్



కడెంలో చీపురుతో ఊడుస్తున్న డీఆర్డీవో



నిర్మల్‌ఖిల్లా: ఊడుస్తున్న పారిశుధ్య సిబ్బంది

భైంసాటౌన్/భైంసారూరల్: గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణను నిర్లక్ష్యం చేయొద్దని, పక్కాగా చేపట్టాలన అదనపు కలెక్టర్, భైంసా మున్సిపల్ ప్రత్యేకాధికారి ఫైజాన్ అహ్మద్ అన్నారు. పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్‌లో సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భైంసా రూరల్ మండలం పేండ్‌పెల్లి గ్రామంలో పర్యటించారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఈనెల 15 వరకు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రతీరోజు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డ్రెయినేజీలు, రోడ్లపై చెత్త తొలగింపు ఖాళీ స్థలాలు శుభ్రం చేయాలని సూచించారు. ప్రజలు, విద్యార్థులను ఇందులో భాగస్వాములు చేయాలని తెలిపారు. అంతకుముందు మున్సిపల్ కార్యాలయంలో తనిఖీ చేశారు. సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పేండ్‌పెల్లి ప్రాథమిక పాఠశాలకు వెళ్లి నేలపై కూర్చుని ఉపాధ్యాయుడు గోపాల్ బోధించిన పాఠాలను విన్నారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబటాటరు. అక్కడి నుంచి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీచేసి చిన్నారులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కమిషనర్ బి రాజేశ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీస్, డీఎల్పీవో సుదర్శన్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో మోజంహుస్సేన్, ఏపీవో శివలింగం, కార్యదర్శి కవిత తదితరులు ఉన్నారు.

నిర్మల్‌ఖిల్లా: పట్టణాలు, గ్రామాలు స్వచ్ఛతను కలిగి ఉంటేనే అనారోగ్యం దరిచేరదని మెప్మా అధికారులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా సోమవారం ప్రారంభమైన ప్రత్యేక పారిశుధ్య స్వచ్ఛత కార్యక్రమాలు ఈనెల 15 వరకు కొనసాగుతాయన్నారు. 3వ వార్డు రాంరావుబాగ్, 33వ వార్డు భాగ్యనగర్ కాలనీల్లో ఈ కార్యక్రమాలు చేపట్టారు. మెప్మా సంఘాల మహిళలు రోడ్లపై చెత్తను తొలగించారు. పారిశుధ్య కార్మికులు చెత్తను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. వార్డుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెప్మా పీడీ సుభాష్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ప్రత్యేక అధికారి మోహన్ సింగ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవదాసు పాల్గొన్నారు.

కడెం: ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని డీఆర్డీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో సోమవారం చీపురుపట్టి వీధులను శుభ్రం చేశారు. అనంతరం కడెం, కన్నాపూర్, కొండుకూర్, పాండ్వపూర్ పంచాయతీల నర్సరీలను పరిశీలించారు. హెచ్ఆర్ మేనేజర్ సుధాకర్, ఏపీవో జయదేవ్, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంతోపాటు రాంపూర్, టెంబుర్ని, గొల్లమాడ, చాక్‌పల్లి తదితర గ్రామాల్లో మురుగుకాల్వల్లో చెత్తాచెదారాన్ని తొలగించారు. మండల ప్రత్యేక అధికారి అంజి ప్రసాద్ ఈ పనులను పరిశీలించారు. ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో తిరుపతిరెడ్డి, కార్యదర్శులు ఉన్నారు.

కుంటాల: అందాకూర్, కల్లూరు గ్రామాల్లో పారిశుధ్య పనులను ఎంపీడీవో లింబాద్రి పరిశీలించారు. ఎంపీవో రహీంఖాన్, పంచాయతీ కార్యదర్శులు భోజన్న, రమ్య తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్: భూత్కూర్‌లో పారిశుధ్య పనులను ఎంపీడీవో రమేశ్ పరిశీలించారు. ఎంపీవో రమేశ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అనిల్, కార్మికులు ఉన్నారు.

లక్ష్మణచాంద: గ్రామాల్లో పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఎంపీడీవో రాధ తెలిపారు. ఎంపీడీవో సమావేశ మందిరంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 15 వరకు అన్ని గ్రామాల్లో పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో అధికారులతో కలిసి శ్రమదానం నిర్వహించారు. తహసీల్దార్ జానకి, ఏవో వసంత్‌రావు, ఎంపీవో అమీర్‌ఖాన్ పాల్గొన్నారు.

సారంగపూర్: మండలంలోని 32 పంచాయతీల్లో కార్మికులు శ్రమదానం నిర్వహించారు. ప్రధాన వీధుల్లో చెత్తాచెదారం తొలగించడంతోపాటు పాఠశాలల పరిసరాలను ఊడ్చి చెత్తను ఏరివేశారు. గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

నేటి నుంచి మల్లన్న జాతర ప్రారంభం

- ముస్తాబైన ఆలయం
- ఏర్పాటు పూర్తి

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో మంగళవారం నుంచి మల్లన్న దేవుని జాతర ప్రారంభమై ఈనెల 15వ వరకు కొనసాగనుంది. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 11న రాత్రి శ్రీ మల్లన్న దేవుని కల్యాణ మహోత్సవం, 12న చల్లని అంబళ్లు, 13న దేవుని పల్లకి ఊరేగింపు, 14న కుస్తీపోటీలు, రాత్రి అగ్నిగుండ ప్రవేశం, సుమారు రూ.లక్షతో కుస్తీ పోటీలు నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాక మహారాష్ట్ర నుంచి మల్లయోధులు తరలివస్తారు. విజేతకు రూ.10 వేలు, 50 గ్రాముల వెండి కడియం , రెండవ విజేతకు రూ.5 వేలు ఇస్తారు. 15న ఆడపడుచుల జాతర, అంబలి కుండ ఇంటికి తేవడంతో జాతర ముగుస్తుంది. భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు.

జాతరకు రావాలని ఆహ్వానం

భైంసాటౌన్: ముధోల్ మండలం ఎడ్‌బిడ్‌లో నిర్వహించే మల్లన్న జాతరకు రావాలని గ్రామస్తులు పలువురు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బి.నారాయణ్‌రావు పటేల్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వానపత్రికను అందించారు. ఈనెల 11 నుంచి 15 వరకు జాతర ఉత్సవాలు జరుగుతాయని గ్రామస్తులు వెల్లడించారు. వీడీసీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ముజ్గిమల్లన్న జాతర

నిర్మల్‌రూరల్: మండలంలోని ముజ్గి గ్రామ మల్లన్న జాతర మంగళవారం ప్రారంభం కానుంది. జాతరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 10 గంటలకు పందిరి కార్యక్రమం, రాత్రి 10 గంటలకు మల్లన్న దేవుని కల్యాణం నిర్వహిస్తారు. 12న మధ్యాహ్నం 2 గంటలకు చల్లకుండలు, సాయంత్రం 6 గంటలకు ఊరు చల్లకుండలు, రాత్రి ఒగ్గు కథ ఉంటుంది. 13న సాయంత్రం 4:30 గంటలకు స్వామివారి రథయాత్ర, 14న నాగవెల్లి, 15న ఉదయం అగ్నిగుండం కార్యక్రమం నిర్వహిస్తారు. జాతర కోసం జిల్లాతోపాటు నిజామాబాద్, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివస్తారు. రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

లోకేశ్వరం: సైబర్ మోసాలపై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని నిర్మల్ జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్ అన్నారు. రాజూర గ్రామంలో బ్యాంకు లావాదేవీలు, సైబర్ నేరాలపై ఆర్థిక అక్షరాస్యతపై సోమవారం అవగాహన కల్పించారు. నిర్వహించారు. ఈవోపీఆర్డీ సోలమాన్‌రాజ్, బ్యాంకు సిబ్బంది ఉన్నారు.

దుండగులను శిక్షించాలి

బాసర: చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానార్చకుడు సీఎస్.రంగరాజన్‌పై దాడికి పాల్పడిన 'రామ రాజ్యం' సంస్థ ప్రతినిధులను కఠినంగా శిక్షించాలని బాసర శ్రీజ్ఞాన సరస్వతి ఆలయ అర్చక వైదిక బృందం డిమాండ్ చేసింది. రంగరాజన్‌పై దాడిని ఖండించింది. రంగరాజన్‌ను దాడి చేసిన 20 మందిని అరెస్టు చేయాలని ప్రధాన అర్చకుడు సంజీవ్, వేద పండితుడు నవీన్‌శర్మ డిమాండ్ చేశారు.

ఎస్పీ కార్యాలయంలో 'ప్రజావాణి'



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఎస్పీ జానకీ షర్మిల అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వాటిని పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను స్వీకరించి పరిష్కరించాలని సీఐ, ఎస్సైలతో ఫోన్‌లో మాట్లాడి సూచనలు చేశారు. ప్రతీ సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.